REGD. NO. A. 18　　విడి ప్రతి 0-20 న. పై.　　శుక్రవారం 14-12-62

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 34 ]　　సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి　　[ సంచిక 50

## ఎంత 'దరిద్రుడు' నిజాం!

కేంద్రం తమకుచెల్లించే భరణాల్లో నూటికి పది వంతులు రక్షణ నిధికి యివ్వవలసిందిగా మాజీ సంస్థానాధీశులకు ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తూ వ్రాయగా, వివా యానా రైలక్షలు పుచ్చుకునే నిజాం నవాబు యిలా జవాబిచ్చారు— "నేను చాల పేదవాణ్ణి. నా భరణంనుండి రక్షణనిధికి యివ్వలేను." – ఎంత దరిద్రుడంటీ ప్రపంచ ఐశ్వర్యవంతుడైన ఈ నిజాం నవాబు! చెరుకును బెల్లం పెట్టమంటే పెడుతుందా?

**పదంతులను వినవద్దు**

* * *

**పదంతులను వ్యాప్తిచేయవద్దు**

### సరిహద్దు సమస్యా పరిష్కారానికి

# యుద్ధం తప్ప మార్గంలేదా?

## విజయగర్వంతో చైనా బెదరింపులు—ప్రధాని శ్రీ నెహ్రూ దృఢ వైఖరి—కొలంబో తటస్థులకృషి—రహస్యారంగు బయటబడింది

సరిహద్దు సమస్యా పరిష్కారానికి యుద్ధంతప్ప గత్యంతరంలేదనే అభిప్రాయపడవలసి వస్తున్నది— ఈ వారపు పరిణామాలనుబట్టి. భారతదేశం ప్రతిపాదించిన న్యాయమైన కోర్కెను— శాంతియుత సంప్రతింపులకు చైనా సేనలు 1962 సెప్టెంబరు 8 తేది నాటి ప్రదేశాలకు పునసంహరింపబడాలనే కోర్కెను— చైనా ప్రభుత్వం తిరస్కరించింది. ఐదేళ్లు సాగించిన దురాక్రమణద్వారా పొందిన 12వేల చదరపు మైళ్ళుగాక, అక్టోబరు 20 తేది తర్వాత పెద్ద పెట్టున సాగించిన సైనిక దాడి మూలంగా అదనంగా అక్రమంగా ఆక్రమించుకున్న 2,500 మైళ్ళ భారత భూభాగాన్నిగూడా స్వంతం చేసుకునే దురుద్దేశ్యంగల చైనావారి 1959 నవంబరు 7తేది సరిహద్దును ఇండియా అంగీకరించవాలదని ప్రధాని శ్రీ నెహ్రూ విస్పష్టంగా ప్రకటించారు.

"చైనావారి మాటలు నమ్మడానికి విలువలేదనే నిర్ణయానికివచ్చాను. ఇండియాకు చైనా ప్రమాదం సుదీర్ఘమైనది. గత ఐదు సంవత్సరాలుగా, ముఖ్యంగా గత మూడు నెలలుగాజరిగిన సంఘటనలు చైనా సామ్రాజ్యవాద. రాజ్య విస్తరణ మూల తత్వాలను స్పష్టంగా బయటపెట్టాయి. ఇది భారత దేశ స్వాతంత్ర్యానికి. ప్రాదేశిక ఐక్యతకు సుదీర్ఘకాలంవుండే సవాలు. ఈ సవాలుకు మనం తలఒగ్గలేము. పరిణామాలు ఏమైనా దానిని మనం ఎదుర్కోక తప్పదు" అని ప్రధాని శంఖారావం పూరించారు.

ఈ వారంలో పంపిన ఒక మెమొరాండం ద్వారా చైనా ఇండియాకు మూడు ప్రశ్నలువేసింది. (1) యుద్ధ విరమణను అంగీకరిస్తున్నారా లేదా? (2) స్వాధీనరేఖకు ఇరువైపులా నిస్సైన్యీకరణకు మీరు ఆమోదిస్తారా లేదా? (3) సరిహద్దు సమస్యా పరిష్కారానికి ఉభయ ప్రభుత్వ అధికార్ల సమావేశానికి మీరు సమ్మతిస్తారా లేదా? వీటికి స్పష్టమైన సమాధానం కావాలని కోరింది చైనా. ఈ ప్రశ్నించడంలోని దురుసుతనం, అందులో వాడబడిన పదజాలం, రెండు స్వతంత్ర సర్వదేశాల మధ్య ప్రయోగింపబడేవిగా లేవు. ఒక పార్లమెంటు సభ్యుడు వ్యాఖ్యానించినట్లు, ఓడిపోతున్న ముద్దాయిని గద్దించి ప్రశ్నించినట్లుంది. అంతేగాదు— విజయగర్వంతో, ఓడిపోయిన వారిమీద షరతులు రుద్దినట్లున్నది.

చైనా ధోరణి ఏవిధంగావున్నా ప్రధాని మాత్రం సౌమ్యంగానే వీటికి సమాధానం చెప్పారు. ఏకపక్షమైన చైనా యుద్ధ విరమణను మేము అంగీకరించాము, దానిని భగ్నంచేసేపని మేము ఏదీ చేయలేదు; స్వాధీన సరిహద్దు ఏదనేది స్పష్టంగా తెలియజేసే నిస్సైన్యీకరణ, అధికార్ల సంప్రతింపుల ప్రశ్నేలేదు అన్నారు శ్రీ నెహ్రూ. 1962 సెప్టెంబరు 8 తేది హద్దును తప్ప భారతదేశం యిక దేనినీ అంగీకరించజాలదన్నారు.

అందువల్లనే పార్లమెంటులో నవంబరు 14 తేది చేసిన "పోరాటం ఎంతకాలం పట్టినా, అది ఎంత కష్టనష్టాలతో కూడిన చైనా చైనా దురాక్రమణ దారునుండి పవిత్ర భారతభూమిని విముక్తంచేయుటకు భారతప్రజ కృతనిశ్చయమైనది." అను ప్రతిజ్ఞా తీర్మానాన్ని తిరుగా పార్లమెంటు చేత పునరుద్ఘాటింపజేశారు. దేశ భవిష్యత్తు ప్రమాదంలోవుంది. దానిని రక్షించుకొనుటకు అందరూ సంసిద్ధంకావాలి అనిగూడా ప్రధాని హెచ్చరించారు. ఇలా అంటున్నామంటే శాంతియుత పరిష్కారలక్ష్యాన్ని మనం వీడలేదనిగూడా శ్రీ నెహ్రూ స్పష్టంచేశారు.

### చైనా బెదరింపులు

8 తేది పెకింగ్‌లో చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి పత్రికలవారికిచ్చిన 4000 పదాలతోగూడిన ఒక 'వివరణ' ఇండియాను తీవ్రంగా బెదరించేదిగా వున్నది. అందులోని ఆరోపణలు, వాదాలు అతి నీచంగాగూడా వున్నాయి.

స్వాధీనహద్దు విషయంలో ఇండియా చైనాను కోరిన వివరణలు అర్థరహితములని, తగాదాను కల్పించేవని, అలక్ష్యం చేయుటకు వన్నిన పన్నాగమని ఆవివరణ పత్రంలో ఆరోపించింది చైనా. తాముజేసిన 1959 నవంబరు 7 స్వాధీన హద్దు సూచన ఒక్కటే పరిష్కారానికి మార్గమని, భారతప్రభుత్వం సూచిస్తున్న 1962 సెప్టెంబరు 8 తేది హద్దు తమకు ఏమాత్రం ఆమోదకరం కాదని విస్పష్టంగా ప్రకటించింది. సరిహద్దు సమస్య విషయంలో ఇండియాపైఖరి "దురహంకారంతో, దురుసుతనంతో, సామ్రాజ్య విస్తరణ తత్వంతో" కూడుకొని వున్నదని ఆ పత్రం ప్రేలినది. ఇప్పుడుగాని, ఎప్పుడుగాని భారతదేశం విదేశీ సహాయాన్ని ఎంతపొందినా చైనాను యుద్ధంలో ఏమీచేయలేరు అనే బెదిరింపు గూడా 'వివరణ'లో స్పష్టంగా వున్నది. "ఇండియా పై ఐ రి తీ వ్రం గా తీసుకోదగింది" అనిగూడా వారి హెచ్చరిక. ఈ వివరణపత్రం జూస్తే చైనా ఎంత అహంకారంతో వ్యవహరిస్తున్నదీ బోధపడుతుంది.

### మనం దురాక్రమణదారులం!

ఇండియా దురాక్రమణదారని, భారత సైన్యం తమ సరిహద్దు కావలాదళంమీద దాడిచేస్తే, ఆత్మరక్షణకు వారు మనమీద పోరుసాగించారని చైనా ఈనాడుగూడా విషప్రచారంచేస్తూ, ప్రపంచాన్ని వంచింపజూస్తున్నది. లక్షమంది సైనికులతో ఒక్కసారి ఇండియాపై దండెత్తి, వేలాది మైళ్ళ

—తరువాత 7 వ పేజీలో



7 తేది నెల్లూరులో వి. ఆర్. కాలేజి విద్యార్థుల సమావేశంలో దేశభక్తిని ప్రబోధిస్తున్న సినీ నటుడు శ్రీ జగ్గయ్య. చిత్రంలోని తక్కిన యిద్దరు ప్రిన్సిపాల్ శ్రీ సుబ్బారెడ్డి, యూనియన్ అధ్యక్షుడు శ్రీ రమణారెడ్డి.



## ****క్రిస్టమస్ - క్రొత్తసంవత్సరం****

శుభ సందర్భముల పురస్కరించుకొని 20-12-62 నుండి 5-1-63 వరకు కేకులు వగైరా తగ్గింపు రేట్లతో విక్రయించబడును.

మిశ్రమ కేకులు ఒకడజను పెట్టె రూ. 2-75 న. పై.
ఫ్రూట్ కాక్‌టైల్ స్వీట్సు అసార్టెడ్ రూ. 5-50 న. పై.



బహుమతులకు గాను కేకులు ప్రత్యేకముగ, చిత్రవిచిత్రముగ, మనోహరముగ, మనోరంజకముగ, ఆకర్షణీయముగ తయారు చేయబడుచున్నవి. అన్నీ బలవర్ధకమైన ఆహారపదార్థములతో కూడినవి. ఒక్కసారి రుచిచూడండి, భుజించండి, ఆనందించండి.

**పూర్ణా బిస్కట్ ఫ్యాక్టరీ,**

(ఫోన్ : 294)

సుబేదారుపేట—నెల్లూరు

